# పిల్లలు

శ్రీమతి రాజేశ్వరిగారు

"రాజ్యం! ఆచదువేదో కట్టిపెట్టి పిల్లనితియ్యమ్మా! ఒక్కమాటూ" అని కసుకు పాట్లు పడుతూ చెప్పింది మాఅమ్మ. దానికి పిచ్చిభయం, వెఱ్ఱిప్రేమ. అమ్మాయి యేడవ నేలేదు; గంటక్రిందటే పాలుతాగి పొత్తిళ్లలో ఒత్తిగిలి పుస్తకంలా పడుక్కుంది. మంచం కింద ముండిగలో వున్ననిప్పు నిద్రపోతూంది. ఇట్టేపుల్లతో కదిపి, వర్షంవెలిసిందికదా అని కిటికీతలుపులు తెరిచేను.

సతీమణులసౌభాగ్యం ప్రకృతిలో ప్రతిఫలించింది. మందగమనం మబ్బులలోనూ, చంచలదృష్టులు మెరపుల్లోనూ, మనసుమెత్తన మందమారుతములోనూ, హృదయప్రసన్నత అంతరాళమంతటనూ ఆవిర్భవించేయి. గ్రీష్మాతపంతో మూర్ఛిల్లిన భూదేవికి శైత్యోపచారంచేసింది వర్షలక్ష్మి. నూతనమైన ఉత్తేజంతో - తలంటుపోసుకున్న తరుణిలాగు-సృష్టి అంతా కోలాహలమైంది.

ఈనీలిచీరకట్టిన నిశాలక్ష్మిని మృత్యుముఖంతో పోల్చిన కవులెంత కఠినహృదయులు? స్వప్నసామ్రాజ్యాలు చవిచూపించేనిశీథాన్ని! కాళిదాసు కబురంపిన మేఘశకలం ఆమె ముంగురులందలిదేకదూ! ప్రకృతిలో ఇట్టి విరామంయెప్పుడు లభిస్తుంది? ఐహికం అంతా విడిచి, మనసు రెక్కలుకట్టుకునేసమయం రాత్రి. పగటివేళ శాస్త్రజ్ఞానంవంటిది; ప్రతివస్తువులోనూ ఉపయోగం నిరుపయోగంతప్ప వేరొకటి కనపడదు. భావఫలకంమీద సౌందర్యచ్ఛాయ హత్తుకొనడానికి నీలితెర అవసరం......

గాలితాకున చప్పట్లుకొట్టి పుస్తకం నాదృష్టిమరలించింది. దీపంవెలుగుతూంది గంటలాగు. కిటికీవదలి, పుస్తకం తలవైపుపెట్టి, అమ్మాయికి మెలకువరాకుండా పక్కలోచేరేను. అప్రయత్నంగా అమ్మాయి నావేపుతిరిగి లకుములాడుకుంది. చేరదీసుకుని పడుక్కున్నాను. ఆలేతశరీరంయొక్క వెచ్చదనం సన్నజోకొట్టింది.

* * * *

నిద్ర! ఎంతటినిరీశ్వరవాదికైనా అస్తికత్వం కలుగచేస్తుంది నిద్ర. ఈశరీరం కట్టుబట్టలాగు విడిచిపెట్టి మనం యేఅదృష్టసీమలకో తర్లిపోతాం. సృష్టివిలాసంలో ఆత్మరహఃక్రీడసలిపే మధుమృత్యువది!

* * * *

గదితలుపు మెల్లగకదిలి నట్లయింది. పారిపోయిన చైతన్యం తనగూటిలో ప్రవేశించి నాకళ్లుతెరిచింది. మాఅక్కయ్యవచ్చి గుమ్మంలో అట్టేనిలబడిపోయింది. మంచినీళ్లకను కున్నాను.

"ఎందుకు? అక్కయ్యా!"

"ఏమీలేదు." గద్గదికతో బరువై నాచెవిపడ్డాది ఆజవాబు.

గతుక్కుపడిలేచేను. నామంచం చెంతికివచ్చి చతికిలపడ్డాది మాఅక్కయ్య.

"నిద్దరపట్టలేదూ, అక్కయ్యా!"

"ఊఁ. ఊఁ. లాలి నిద్రపోతూందో లేదో అనీ—"

"ఇదుగో, నాపక్కలోనే పడుక్కుంది."

"రెండుగంటలైనట్టుంది, ఓమాటు అడ్డాల్లో వేసుకున్నావా?"

"పదిగంటలైన తర్వాత తాగింది......ఔనుకాని అక్కయ్యా! ఎందుకు లేచి నావు? బావకాని యీమూడుగంటలరైలులో వస్తున్నారా ఏమిటి?"

"లేదే, ఇంకామొన్ననే కదూ వెళ్లేరూ? రేపుమెయిల్లో వచ్చేస్తారు......అయితే, రాజ్యం! రాత్రి అంతసేపుదాకా చదువుతున్నావు; భయంఅనిపించదూ?"

"ఎందుకు భయం?"

"ఊఁ. ఊఁ. లాలి ఒక్కర్తీ మంచంమీద నిద్రపుచ్చేసీ—ఎలా చదువుకుంటావని."

నాకేమీ సమాధానంతోచలేదు. "కావలిస్తే చదువుకో, నాకు నిద్రతేలిపోయింది, రెప్పలు బరువెక్కేదాకా యిక్కడే వుంటాను."

అర్థముకాని యీఆందోళనతో నానిద్రకూడా పూర్తిగా తేలిపోయింది. సరే అని కుర్చీలోనికిజరిగి పుస్తకంతీసేను. మాఅక్కయ్య నామంచంమీద చేరి నడుము వాల్చింది. వడగాడ్పువంటి నిట్టూర్పు నాచెవిసోకింది!

ఊహాలకందరాని వ్యాపృతిలో నామనసు లీనమైపోయింది. అరమూసిన కనురెప్పల లోనుండి నీరెండలాగు దీపంకనిపిస్తూనేవుందినాకు. ఒడిలో జారిన పుస్తకంజారినట్లే నన్ను కౌగలించుకుని ఉండిపోయింది. జల్లువిడిచిన శ్రావణనిశిలాగు నిశ్శబ్దంగా నిద్రించింది మాఅక్కయ్య............

మనసు బరువంతా విదిలించుకుని టైముచూతామని లేచి మేజావైపు వెళ్లేను. నాలుగు దగ్గరైంది. అమ్మాయి కదిలినట్లయిందికదా అని దగ్గరకెళ్లేను. లేతపెదవుల నుండి నక్షత్రకిరణంలాగు చిర్నగవుతోచి మళ్లీ కరగిపోయింది. మళ్లీ అంతట్లోనే కాళ్లూ చేతులూ విదిలిస్తూ తనసూదిగోళ్లతో మాఅక్కయ్యపైటకొంగు లాగేస్తూంది.

ఏదోమహాపచారంచేసినట్టు మాఅక్కయ్య,చప్పునలేచిపోయి "లాలిని తియ్యమ్మా, రాజ్యం! ఎందుకొచ్చిన పుస్తకాలూ?" అంటూ, పైటచెఱగుతో కళ్లొత్తుకుంటూ గది గుమ్మందాటింది!